క్లుప్తంగా

టైర్ పేలి అదుపుతప్పిన కారు



ప్రమాద స్థలంలో కారును పరిశీలిస్తున్న పోలీసులు

గండేపల్లి: జాతీయ రహదారిపై ఆదివారం కారు టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై విజయవాడ నుంచి విశాఖపట్నం వెళుతున్న ఇన్నోవా కారు మండలంలోని మల్లేపల్లి శివారు బ్రిడ్జ్ దిగిన వెంటనే ప్రమాదానికి గురైంది. కారు ముందుభాగంలో టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కారు వెనుకభాగంలో ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని స్టిక్కర్ ఉండటంతో ఏ శాఖకు సంబంధించిన అధికారిదో తెలియాల్సి ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నేత సుభాష్ చంద్రబోస్

ఏలేశ్వరం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. దేశంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టడంతో ఆ పార్టీ నేత పైల సుభాష్‌చంద్రబోస్‌తో కలిసి ఆదివారం పట్టణంలో విజయోత్సవ సమావేశం నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉమ్మిడి వెంకట్రావు, పైల అయ్యప్ప, వాగు రమేష్, కర్రి ధర్మరాజు, కురాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: జగ్గంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 2న జరిగిన 28వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్ 14 బాలుర, బాలికల విభాగంలో తమ కరాటే స్కూల్ నుంచి పోటీల్లో పాల్గొన్న ఎనిమిది మందిలో ముగ్గురు ప్రథమ, ఇద్దరు ద్వితీయ, ముగ్గురు తృతీయ స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఒమ్మంగి శ్రీభారతి స్కూల్‌కు చెందిన టి.నవ్యశ్రీ, టి.సుశాంత్, గొల్లప్రోలు మండలం దుర్గాడ శ్రీవిశ్వభారతి స్కూల్‌కు చెందిన ఎస్.బాలసుబ్రనంద్‌బాబు ఉన్నారు. ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన వై.అమృత, జె.సంజులకు ద్వితీయ స్థానం, ఒమ్మంగి శ్రీభారతి స్కూల్‌కు చెందిన ఎస్.కాశీ, ఎన్.మనోజ్ కుమార్, దుర్గాడ శ్రీవిశ్వభారతి స్కూల్‌కు చెందిన కె.సత్యశ్రీలకు తృతీయ స్థానం లభించాయని కరాటే మాస్టరు పి.బుజ్జి వివరించారు. కాగా విజేతలకు ఆదివారం ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డా ఆరోగ్యమస్తు !

- ఎంసీపీ కార్డుతో మాతాశిశువులకు మేలు
- నియోజకవర్గంలో 1,474 మంది గర్భిణులు, 1,594 మంది బాలింతలు
- తల్లి, బిడ్డకు వేర్వేరుగా ఐడీ నంబర్లు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కన్యాకుమారి



ఎంసీపీ కార్డు

ప్రత్తిపాడు: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకూ ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటేనే తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలు దరిచేరకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. దీని కోసం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా మాతా శిశు మరణాలు మాత్రం ఆగడం లేదు. ప్రసూతి సమయంలో గర్భిణులు అవగాహన లోపంతో మృతి చెందుతున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించి తొలి నుంచి పూర్తి సమాచారం ఒకే చోట అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులు అందజేసింది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమాచారాన్ని ఇందులో పొందుపర్చారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయస్సు వచ్చే వరకూ ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. తల్లికి, బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేకంగా ఐడీ నంబర్లు ఇస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య సేవలు పొందడంతో పాటు వైద్య పరీక్షలు, మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలను ఈ కార్డులో పొందుపర్చారు. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టిసారించడమే ఈ కార్డు లక్ష్యం. కార్డులో ఇచ్చిన సమాచారం ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా గర్భిణులతో పాటు బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే తదితర పథకాల వివరాలను కార్డులో పొందుపర్చారు. ఎంసీపీ కార్డులో వైద్య ఆరోగ్య సిబ్బంది అందించాల్సిన సేవల వివరాలు, వివిధ రకాల వ్యాధుల లక్షణాలు వివరించారు. నవజాత శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో వాటిని అధిగమించడానికి నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేలా ఈ కార్డులో వివరించారు.

ఎక్కడైనా వైద్య సేవలు



గర్భిణులు తొలిసారి తమకు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్ష చేయించుకున్న సమయంలో వారికి ఎంసీపీ కార్డులో వివరాలను నమోదు చేసి అందజేస్తారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు పరీక్షలు చేయించుకుంటే గర్భిణుల్లో రక్తహీనత ఉందా, హైరిస్క్ సమస్యలు ఏమైనా ఉన్నాయా... అనే వివరాలు కార్డులో నమోదు చేస్తారు. ఆ కార్డు ఉంటే ఏ ఆసుపత్రులలోనైనా సులువుగా కాన్పు చేయించుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ సౌమ్య, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ప్రత్తిపాడు

అన్ని సేవలకూ ఒకే కార్డు

తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను దీనిలో ముద్రించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లల శారీరక–మానసిక ఎదుగుదలకు సంబంధించిన అంశాలు, ఐరన్, పోలిక్ ఆమ్లం ప్రాధాన్యాన్ని కార్డులో పొందుపర్చారు. బిడ్డ పుట్టిన సమయం కార్డులో నమోదు చేస్తే వెంటనే జనన ధృవీకరణ పత్రం వైద్యశాలలో అందిస్తారు.

నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల్లో 257 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,593 మంది బాలింతలు, 1,474 మంది గర్భిణులు ఉన్నారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. వీరందరికీ ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి మండల కేంద్రాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), రౌతులపూడిలోని కో–లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాచపల్లి, పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం, శంఖవరం, పెదమల్లాపురం, జడ్డంగి అన్నవరం, ములగపూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) సిబ్బంది వైద్యం, సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

సత్యదేవుని దర్శించిన సినీ నటుడు అల్లరి నరేష్



సత్యదేవుని సన్నిధిలో సినీ నటుడు అల్లరి నరేష్

అన్నవరం: ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేష్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వారికి వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సత్తెన్న పెళ్లికొడుకాయనే..



పెండ్లికుమారుడు, కుమార్తె అలంకరణలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరునది ఒడ్డున వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెను చేశారు. ఉదయం అర్చకుడు పాన్నూరు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పెళ్లికుమారుడు, కుమార్తెగా ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. 18న స్వామివారి గ్రామోత్సవం, 19న సదస్యం, పండిత సత్కారం, 20న విశేషార్చన, 21న పూర్ణాహుతి, చక్రస్నానం, ప్రసాద వితరణ, శ్రీపుష్పయాగం, 22న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీశ్రీ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది

కాకినాడ సిటీ: కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడం, కష్టజీవుల పక్షాన నిలబడడం శ్రీ శ్రీ వల్లనే సాధ్యం అయ్యిందని అద్దేపల్లి ప్రభు కొనియాడారు. శనివారం రాత్రి కాకినాడ యూటీఎఫ్ హోంలో శ్రీశ్రీ 41వ వర్థంతి సందర్భంగా 'శ్రీశ్రీ ని స్మరించుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకరవర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ – నేడు అనే అంశంపై అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. సాధారణ ప్రజలు కూడా శ్రీశ్రీ కవితలు చదివి స్ఫూర్తి పొందుతారన్నారు. కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడంలో కష్టజీవుల పక్షాన నిలబడడంలో శ్రీశ్రీకి మరొకరు సాటి రారన్నారు. రాజకీయ చైతన్యం, మార్క్సిజంతో కొనసాగడం శ్రీశ్రీ ప్రత్యేకతగా గుర్తించాలన్నారు. ప్రభాకరవర్మ మాట్లాడుతూ ఆకాశంలో విహరిస్తున్న సాహిత్యాన్ని భూమార్గం పట్టించిన ఘనత శ్రీశ్రీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, పెన్షనర్ల సంఘం నాయకులు కె.సత్తిరాజు, ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం, పలివెల వీరబాబు తదితరులు శ్రీశ్రీ కవితలు చదివి వినిపించారు. అంతకు ముందు వారు శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు.

సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ అవినాష్

ఏలేశ్వరం: యువత సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ సూచించారు. స్థానిక లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ కల్యాణ మండపంలో ఆదివారం సైంటిఫిక్ ప్రోగ్రాం అండ్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్) తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతీ యువకులు సాంకేతిక విజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. మూఢనమ్మకాలు విడనాడాలని సూచించారు. డీఆర్‌డీఓ సైంటిస్టు విక్రాంత్ మాట్లాడుతూ గ్రామాలను యువత అభివృద్ధిలో పథంలో నడిపించాలన్నారు. సైబర్ సెక్యూరిటీపై స్పార్క్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయన్నారు. సినీ నటుడు వినయ్ మాట్లాడుతూ స్పార్క్ సంస్థ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో మణిహంస పవర్‌ప్లాంట్ ఎండీ వెంకటరెడ్డి, స్పార్క్ సీఈఓ ప్రదీప్, సలహా కమిటీ సభ్యుడు బదిరెడ్డి గోవిందు, డీఆర్‌డీఓ అధికారి రజని, అఖిల భారత విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు యశ్వేంద్ర, స్పార్క్ సభ్యులు రవికిరణ్, అదిత్య, సాహిల్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



పెదశంకర్లపూడిలో గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన క్వారీ లారీలు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో క్వారీ లారీలను ఆదివారం సాయంత్రం గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని చినశంకర్లపూడి క్వారీ క్రషర్ల నుంచి బ్లాక్ మెటల్ రవాణా చేసే టిప్పర్లు, లారీలు నిబంధనలకు విరుద్ధంగా గ్రామం మీదుగా వెళ్లడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. బ్లాక్ మెటల్ రవాణా చేసే వాహనాలు అధిక లోడు, మితిమీరిన వేగం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. అధిక వేగానికి పాఠశాలలకు వెళ్లే చిన్నారులతో పాటు గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆరోపించారు. గ్రామస్తుల అవస్థలకు కారణమైన క్వారీ, క్రషర్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. లారీలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు



జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాపు జేఏసీ నాయకులు

గండేపల్లి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆదివారం కాపు జేఏసీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు ఆదివారం జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కాపు జేఏసీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆర్య వైశ్య సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే నెహ్రూను కలిసి అభినందనలు తెలిపారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు. కాకినాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్, తోపుడు బండ్ల వర్తకుల సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం



ప్రత్తిపాడు మండలంలో ఆకాశం మేఘావృతమై చల్లబడిన వాతావరణం

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులలతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. గత వారం రోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. జూన్‌నెలలో రెండు వారాలు గడుస్తున్నా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడితే వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

చల్లబడిన వాతావరణం

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత, ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కాగా ఏటా జూన్ మొదటి వారంలో రుతుపవనాల ప్రభావంతో ఎండలు తగ్గు ముఖం పట్టి వర్షాలు కురుస్తాయి. కాగా ఈ ఏడాది వాతావరణం దానికి పూర్తి భిన్నంగా ఉంది. ఈ మాసంలో రెండు వారాలు గడిచినా వాతావరణంలో మాత్రం మార్పు రాలేదు. రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు పడకపోవడంతో బోర్లు కింద మినహా మిగతా రైతులు వరి నారుమళ్లను సిద్ధం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వృక్షం పునర్జన్మకు ఆల్ ఈజ్ వెల్ కృషి



సూర్యారావుపేటలో కూలిన చెట్టు




స్థానిక జంతుహింస నివారణ సంఘంలో చెట్టును పాతిపెట్టిన దృశ్యం

బోట్‌క్లబ్: సుమారు 40 ఏళ్ల నాటి వృక్షం నాలుగు రోజుల క్రితం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. రోజూ ఆ మార్గం మీదుగా వెళ్తూ ఆ చెట్టును చూసే వారు వారికి తెలియకుండానే దానిపై ప్రేమ పెంచుకున్నారు. ప్రస్తుతం ఆ చెట్టు కూలిపోవడంతో వారు మనోవేదన వ్యక్తంచేస్తున్నారే తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి. ఈ విషయం తెలుసుకున్న ఆల్ ఈజ్ వెల్ సంస్థ సభ్యులు ఆ చెట్టును తిరిగి బతికించేందుకు కృషి చేస్తున్నారు. సూర్యారావుపేటలో పడిపోయిన ఆ చెట్టును వారు అక్కడి నుంచి తరలించి నాగమల్లితోట సమీపంలో ఉన్న జంతు హింస నివారణ కేంద్రంలో పాతిపెట్టి చిగురింపజేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే పడిపోతున్న మరిన్ని మొక్కలను రీ ప్లాంటేషన్ చేయడానికి ఆ సంస్థ సభ్యులు కిషోర్, అతని బృందం సిద్ధంగా ఉన్నారు.

మృగశిరాన ఉష్ణతాపం

- రోహిణీ కార్తెను మించి ఎండల తీవ్రత
- బయటకు వెళ్లే సాహసం చేయలేని పరిస్థితి
- ఉదయం తొమ్మిది నుంచే వేడి గాలులు



వేసవితాపం నుంచి ఉపశమనానికి కాలువలో జలకాలాడుతున్న చిన్నారులు



కరపలో నిర్మానుష్యంగా ఉన్న కాకినాడ వెళ్లే రోడ్డు

కరప: మృగశిర కార్తెలో ప్రచండ భానుడు చెలరేగిపోతున్నాడు. సహజంగా మృగశిర ఎండలు ఉడికించేస్తాయంటారు. అంతకు మించి ఉన్న ఉష్ణతాపాన్ని భరించలేక గ్రామాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. ఆదివారం నాటి ఎండ 41 డిగ్రీలు నమోదు కావడంతో పిల్లా పెద్దా అంతా బేజారెత్తిపోయారు. మృగశిర కార్తె వచ్చి వారం రోజులైనా ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కిరి, బిక్కిరవుతున్నారు. ఒక పక్క కాలువలకు నీరొదిలారని, నైరుతి రుతుపవనాలు కూడా వచ్చేశాయని ప్రజలు సంతోషపడ్డారు. ఆ సంతోషం ఎంతో సేపు లేకుండా రెండు రోజులుగా ఎండలు, ఉక్కపోత, వడగాడ్పులతో భయపడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయని వాటిని తట్టుకోలేకపోతున్నామని వృద్ధులు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కాలువల్లో స్నానం చేస్తూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. నైరుతిరుతుపవనాలు పూర్తిస్థాయిలో రావాలని ప్రజలు భగవంతున్ని ప్రార్థిస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప: మండలం నడకుదురు సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరప గ్రామానికి చెందిన పోలిశెట్టి గణేష్ ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కాకినాడ వెళ్తుండగా నడకుదురు, తూరంగి గ్రామాల మధ్య ఉండే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి ఉప్పలంక వైపు నుంచి ఇంద్రపాలెం వైపు వెళ్లే కారు బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గణేష్‌కు చేతులపైన, కాళ్లపైన, తలవెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో ఉన్న నలుగురు యువకులు స్పందించి క్షతగాత్రుని ఫోన్ నుంచే బంధువులకు సమాచారం అందించి, కరప తీసుకొచ్చి అప్పగించారు. కరపలో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం బంధువులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.